# అంతరాంతరం

శ్రీ విహారి - శ్రీ శాలివాహన

శారద చంద్ర చంద్రికలు ధాత్రీ మహాదేవి మేని యందానికి వింత చందం కూరుస్తున్నాయి.

గుడిసెలో బహు దగ్గరలో పడుకున్న వారిద్దరూ ప్రక్కకు వత్తిగిలేరు. అసంకల్పంగా ఒకరికొకరు ఎదురెదురైనారు.

డొంక కిరువైపుల—పచ్చని పట్టు తివాచీ పరచినట్టున్న ఒకపంటచేను, మసాణివంటి ఒక చౌటి బీడు. వాటి ఉనికిలో వ్యత్యాసం అతిస్వల్పం. ఔన్నత్యంలో అంతరం మాత్రం అనల్పం.

సంబరం పొంగులు వార తలవూపి ఉప్పొంగిపోవలసిన సమయంలో — చలనంలేక అంతస్పందనానికి తలవంచి సతమత మవుతున్నది పసిడి పసి హృదయం.

ప్రపంచపు రణగుణ ధ్వనుల్ని లక్ష్యంచేయక ఆదమరచి నిద్రించవలసిన ఆ బుడుతడి చిరుకన్నులు— చింత నిప్పులుగా వేయి మరుత్తులొకటై వెలిగినట్లు వెలిగి పోతున్నాయి.

గోవిందు మనస్సు కళ్ళెం లేని గుర్రమైంది.

"తాత తనకీ పేరు పెట్టినప్పుడే పళ్లు నూరేడంట అయ్య. ఊఁ—. నూరకేం చేస్తాడు? — రోజూ గేదెల్ని నరకటానికి కత్తి నూరటంలో మొనగాడు గదా?. తాత చేసింది పెద్ద తప్పని అప్పుడే తనని చంపేస్తానన్నాట్ట.

'ఆడు నా పేణం. ఆణ్ణి చంపాలంటే ముందుగా నన్ను మట్టు పెట్టాలిరా' అని తాత కళ్లురిమితే సప్పబడినాడంట—చేతగాని దద్దమ్మ!

తాత మాత్రం తక్కువ తిన్నాడా?—

తనకు సదువుకునే ఈడొచ్చాక 'ఆడికి ఉరుదూ చెప్పిస్తే నే చస్తానని' మొఱికేసిండు. 'ఉరుదూ అంటే ఏంది తాతా'! అంటే, 'అదేరా, మీ అయ్యా, అమ్మ మాట్లాడే బాస' అన్నాడు.

ఆ బాసలో తనకి 'మా—బాబా' అని రెండు మాట లొచ్చినందుకే కసురుకుంటాడు తాత. 'సువ్వాళ్ళ మాట్లాడే మాటలు యినిపించుకోకు చిన్నా' అని బుద్దులు చెప్పి తనకా బాస రాకుండా సేశాడు. ఇదీ అయ్యకు పడలేదు.

అసలిదనేందిలే?— తనంటేనే అయ్యకు కసి. తనను తెలుగు బళ్ళో ఏసినప్పుడూ పెద్ద బాగోతం చేసిండ్రు—అయ్యా, ఆడి ముఠా.

అయితే ఏం?— తాత తన పంతం గెల్చాడు. లేకపోతే తనిప్పుడెట్టా 'రెండు' సదువుతూ ఉంటాడు. అరి దీని యబ్బ! మళ్ళీ సదువు అనే వచ్చిందే. సదువు అన గొళుదుఁరా 'చదువు' అనాలని ఆ నత్తి మేష్టారు చెప్పారుగా. ఆయనకు 'డు' రాదు. పాపం. డు ఎక్కడొచ్చినా 'ళు' అంటూవుంటాడు. బలే మేష్టార్లే!

సణుగుడు తాత్కాలికంగా సద్దుమణిగి సన్నని చిరు దరహాసరేఖ విరిసింది—గోవిందు అధర పల్లవంమీద. తల క్రింద పెట్టుకున్న కుడిచేయి తిమ్మిరెక్కింది. నెమ్మదిగా తీసి బాగా విదిలించాడు. ఎదురు మంచంమీద గురక పెడుతూ ఉన్న తండ్రివైపు చూచాడు.

"చూడు. ఎంత లావు చేతులో—తుమ్మ మొద్దుల్లాగా. పేణం పోయేటట్టు కొట్టాడు." గోవిందు ముఖం కోపంతో కందగడ్డలా అయింది. చేత్తో వీపు నిమురుకున్నాడు. ఈతబెత్తపు వాతలు చేతికి తగిలేయి. ఏడుపు ముంచుకొచ్చింది. పెదవులు కంపించి కళ్ల నీళ్ళు తిరిగినై.

"పాడు మనిసి. ఆయేల అమ్మనీ యిట్టాగే. ఛా .... ఛా .... ఇట్టాగా ?—ఇంతకంటే జాస్తిగానే చితకబొడిచిండు. అమ్మ తప్పేం ఉంది. తాగొచ్చి చావ బాదాడు గాని అసలీడి బుద్దే యింత—" అసహ్యంతో చూపులు మరల్చుకున్నాడు.

బయట వీస్తున్న యీదరగాలి తన శాఖను గుడిసెలోకి పంపింది. చలికి అల్లల్లాడిపోయేడు, గోవిందు. జారి

పోయిన పొట్టే లాగూ, పైకి పోయిన చొక్కా సరిచేసు కున్నాడు. కాళ్ళు రెండూ ముడుచుకుని, చేతులు పొట్టలో పెట్టుకున్నాడు. వీపు వెనక్కు జరిగి తాతకు కొట్టుకుంది.

'ఏందిరా' అంటూ కదిలేడు ముసలితాత.

'ఏంలేదు తాతా. చలిగా ఉంది.' అని కళ్ళు మూసు కున్నాడు గోవిందు.


Statement about ownership and other particulars about newspaper

**BHARATI**

1. Place of Publication :
6&7, Thambu Chetty St. Madras-1.
2. Periodicity of its publication :
7th of Every Month
3. Printer's Name :
Sri S. Radhakrishna
Nationality: Indian
Address: 6&7, Thambu Chetty Street, Madras-1
4. Publisher's Name :
Sri S. Radhakrishna
Nationality: Indian
Address : (As above)
5. Editor's Name:
Sri S. Sambbu Prasad
Nationality Indian
Address: 29, Chamier's Road, Madras-28.
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one per cent of the total capital.

| NAMES | ADDRESSES |
|---|---|
| 1. Mr. S. Sambhu Prasad | 29, Chamier's Road, Madras-28. |
| 2. Mrs. S. Kamakshamma | Do |
| 3. Mr. S. Nageswara Rao | Do |
| 4. Mr. S. Radhakrishna | 6 & 7, Thambu Chetty Street, Madras-1. |

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. RADHAKRISHNA,
7-3-64 Signature of Publisher.


పైగుడ్డను నిండుగా కప్పి, గోవిందును కౌగిలించు కున్నాడు తాత.

పులకింపజేసే స్పర్శ !

అనూహ్యమైన ప్రేమాలింగనం!

'ఈడి చేతు లిరగ. గొడ్డును బాదినట్టు బాదినాడే. వాతలు తేలాయి. ఈడి కోపం నాశనం కానూ. నేనుంటే నరికేవాణ్ణి నాయాల్ని' అని గోవిందు వీపును అప్యాయంగా నిమిరి మీద చెయ్యి వేసేడు తాత.

తాత సానుభూతి మాటలు గోవిందు హృదయానికి అమృతపు జల్లులై కరగించినై. అతని కనుకొలకుల్లో నిలిచిన బాష్పబిందువులు కొల్లలు కొల్లలుగా పెల్లుబికినై—స్నిగ్ధ కపోలాల మీద గా జారి పారినై.

సెకన్లు పెరిగి నిముషా లైనాయి.

ఆ కన్నీటిధారలు చారలు కట్టినై—ఆతని చెక్కిళ్ళ నునుపుకు మాలిన్యాన్ని పులుముతూ.

ఆతని మానస సాగరంలోని తీవ్ర ఘోష తిరిగి విజృంభించింది.

"తాత అన్నట్టు నిజంగానే గొడ్డును కొట్టినట్టు కొట్టిండు. తనెంత సెప్తున్నా యినుకుంటేగా. 'నాకేం తెలవదు బాబా' అని బ్రతిమాలుకున్నా వదల్లేదు. ఆఖరికి భయంతో లగెత్తినా ఎంటబడి కొట్టిండు—మద్దెలో వచ్చి నందుకు అమ్మకూ తగిలినై. పాపం ! అమ్మకు నొప్పిగా లేదేమో ? నిద్దరోతోంది."

"లేకపోతే .... .... ..... .....

అలవాటై ఉంటుంది !—అంతే.

అసలీ రబసకంతా నాయాలు ఆ ఖాన్‌గాడు కదూ కారణం. ఆడి పని రేపు చెప్తాలే" గోవిందు పెదవులు బిగి పడినై.

"వాసు కోసం ఆ దొరగారింటికి పోదాం. తోడు రారా" అని బతిమాలితే వెళ్ళాడు గానీ లేకబోతే తనకేం పని. వచ్చిన ఎదవ సరిగా తిరిగి రాక, ఎదవ పని చేశాడు. దొంగ నాయాలు!

ఈడు తియ్యకుంటే అళ్లింట్లో బల్లమీది గడి యారం ఏమైపోద్ది. పెద్దయ్యగారు అప్పుడే ఆడుంచి లోపలి కెళ్ళారంట. ఆ ఎంటనే తామే గదా ఆడకి పోయింది. ఆడే తీసుంటాడు. ఖాన్‌గాడి దసలు దొంగబుద్దే. బళ్లో ఎన్నెన్ని నూక్కుపోతుంటాడో తనకు తెలీకుంటేగా. కంతిరిగాడు !

'ఆడే తీసుంటాడు మొర్రో. నాకు తెలవదని ఎంత మొత్తుకున్నా యినుకుంటేగా—అయ్య.' 'కాదు. నువ్వే తీసుంటావ్, ఏడ పెట్టావో చెప్పమ' ని రెండు ఈతబెత్తాలు యిరగ్గొట్టాడు.

అంతే. ఏం తెలీనోడికే యీ కాలంలో తన్నులు. ఛా. ఈళ్ల కసలు ఖాన్‌కి మళ్లే దొంగలే కావాలె. నాదే తప్పు.''

తాత చేతిని పక్కకు తీసేడు గోవిందు. కదలకుండా పడుకున్నాడు ముసలాయన. గోవిందు పరీక్షగా తాత మొహం లోకి చూసేడు. ఆయన అన్నమాటలు అతని చెవుల్లో మార్మోగినై—''ఈడి కోపం నాశనంకానూ ?''

గోవిందు తండ్రివైపు కోపంగా చూశాడు. ''అయ్య కోపానికి అంతులేదు. ఏ యిసయానికైనా అట్టాగే చంపుతాడు, మనుసుల్ని. ఇదివరకోసారి చిన్నోడు 'మరీ యిది' గా ఏడుస్తుంటేనూ అంతే. అణ్ణి నాలుగు బాది, తొడ పిసికిండు. గిలగిల్లాడిపోయేడు వాడు. ఆనక తెలిసింది. ఆడికి కంది రీగ పీకిందని. పాడు అయ్య ! ఇప్పుడు తననూ అంతే. చెయ్యిని తప్పుకు ఎన్ని కొట్టిండో—'' గోవిందుకు ఉక్రోషం పొంగింది.

కళ్ల చేరెడు చేసుకుని చూడసాగేడు తండ్రివైపు. అతని మనస్సులో ఎన్నెన్నో ఊహలు కలగాపులగంగా అల్లుకో సాగేయి.

లేచి కూర్చున్నాడు.

''నేనుంటే నరికేవాణ్ణి నాయాల్ని''—తాత పలుకులు చెవుల్లో గింగురు మన్నాయి.

అతని హృదయంలో రగులుతున్న పగ రాజుకుని పావక జ్వాలలై జ్వలించింది.

నేనుంటే నరికేవాణ్ణి నాయాల్ని'—

'. . . నరికేవాణ్ణి నాయాల్ని'—

'.... .... నాయాల్ని'—

గోవిందు పళ్లు పటపట కొరికాడు. గుప్పిట బిగించి లేచాడు. అతని కోపాగ్నికి సాయంగా ఝుంఝూమారుతం వీచింది.

ప్రశాంత నిశి—అశాంత మనస్కుడు.

లోకం నిద్రాదేవి ఒడిలో విశ్రాంతి పొందుతున్నది—శోకం, కోపం అతనిలో తారస్థాయి నందుకున్నవి.

తడబడుతున్న అడుగులతో, అల్లల్లాడుతున్న మనస్సుతో గుడిసె మూలకు వెళ్లాడు.

మృత్యువు ముడుచుకు కూర్చున్నదా మూల !

బలవంతంగా యీవలకు లాగేడు ! భారంగా అతని కళ్ళెదుట నిలబడింది—పొట్టేళ్లను కొట్టే సొట్టి కత్తి !

శక్తిని కూడదీసుకుని రెండు చేతులతో ఎత్తి పట్టుకున్నాడు. మానవత్వంలోని పశుత్వానికి ప్రేరేపణ కలిగింది. విజృంభించి మానవు నొక త్రోపు తోసింది.

గోవిందు తండ్రి మంచం ముందు కొచ్చేడు. కోపారుణితనేత్రాలతో తండ్రిని చూసేడ. కథలలోని రాక్షస రూపం కళ్లముందు నర్తించింది, గోవిందుకు.

పెదవులు బిగబెట్టి కత్తి నెత్తాడు!

దూరంగా వూర కుక్క గీపెట్టి శోకించింది.

ఫర్లాంగు దూరంలోని రోడ్డుమీద పోతున్న లారీ హారన్ ధ్వని చెవుల్లో గింగురుమన్నది.

ప్రక్కనున్న పక్కమీది తాత ప్రక్కకు తిరిగేడు. దీపపు బుడ్డి గుడ్డి వెలుగులో చచ్చిన బల్లి పిల్లను చీమలు లాక్కుపోతూ, గోవిందు కాలును కుట్టినై.

తల్లి ఒడిలో పడుకున్న పసివాడు కెవ్వుమన్నాడు. తల్లి యీవైపుకి తిరిగి పిల్లడ్ని జోకొట్టసాగింది.

గోవిందు శరీరం చిరుగాలికి వూగే తీగలా ఐంది. అటు యిటు తూలిపోయేడు. చేతిలో కత్తి క్రిందపడి మట్టిలో ముద్దలా కూరుకుపోయింది.

నిలకడ తప్పిన గోవిందు నిట్రాడి తాటి బొండుకు కొట్టుకున్నాడు. మొహం గీరుకుపోయింది. 'మా' అంటూ మూలిగి క్రింద పడ్డాడు.

కళ్లు తెరచి చూసేసరికి—

తలమీది బొప్పిని అరచేతితో నిమురుతున్న 'అయ్య' వడిలో పడుకుని ఉన్నాడు—గోవిందు.

గంప క్రింది పిల్లకోడి తల్లి రెక్క క్రింద ముడుచు కుంది.

---